‘‘శారదమ్మొదినా! ఓ శారదమ్మొదినా!’ అని ఎవరో పిలుస్తుంటే బయటికి వచ్చింది శారదమ్మ. వాళ్ళ పిట్టగోడ ప్రక్కనే పక్కింటి పార్వతమ్మ నుంచొని వుంది. బహుశా నన్ను పిలిచింది ఈవిడే అనుకుంటూ ‘‘పిలిచారా వదినా!’ అంది శారదమ్మ.

‘‘ఆ పిలిచాను! కొద్దిగా ఈ కప్పుతో కందిపప్పు యిస్తారా? తర్వాత ఇచ్చేస్తాను. ఈవేళ సండే కదా! ఎవరూ వెళ్ళనంటున్నారు కొట్టుకు’’ అంది పార్వతమ్మ శారదమ్మకు కప్పు అందిస్తూ.

‘‘సండే అయితే వెళ్ళడానికేంటటా?’’ అంది ఆ కప్పు తీసుకుంటూ శారదమ్మ.

‘‘అయ్యో! మీకు తెలీదు మా ఇంటి సంగతి. ఈ వేళ సండే కదా! పిలిచినా ఒక్కడూ లేవడు. కారణం టీవీకి అతుక్కుపోవడమే. ఎంత పిలిచినా రారు. అందులో ఈ వేళ ‘రామాయణ్’ వస్తుందిగా. కనీసం మీ అన్నయ్య కూడా వెళ్ళమంటే వెళ్ళరు’’ అంది పార్వతమ్మ నిట్టూరిస్తూ.

‘‘ఉండండి. కంది పప్పు తెచ్చిస్తాను’’ అంటూ లోపలికెళ్ళి పప్పు తెచ్చింది శారదమ్మ.

‘‘ఔను వదినా! ఏంటి మీ ఇంట్లో టీవీ పెట్టినట్టు లేదు! కరెంట్ ఏమైనా పోయిందా?’’ అంది పార్వతమ్మ ఆ కందిపప్పు తీసుకుంటూ.

‘‘అదేమీ లేదొదినా! మేము టీవీని నిన్ననే అమ్మేశాము. మా అబ్బాయి రోజూ తిట్టిపోస్తున్నాడు, పిల్లల చదువు పాడవుతుందని. అందుకే అమ్మేశాము. అందుకే పిల్లలు కామ్‌గా ఎవరి పని వాళ్ళు చేసుకుంటు న్నారు’’ అంది శారదమ్మ.

ఇంకా ఏదో చెప్పబోయింది టీవీలోని ప్రోగ్రాం గురించి పార్వతమ్మ.

ఇంతలో ‘అమ్మా’ అన్న పిలుపు వినవచ్చింది. ‘‘నేను వెళ్ళొస్తానండి. మా అబ్బాయి వచ్చినట్టున్నాడు’’ అని లోపలికి వెళ్ళిపోయింది శారదమ్మ.

వాళ్ళ అబ్బాయి వస్తే ఈవిడ ఎందుకంత కంగారుగా వెళ్ళింది అన్న అనుమానమొచ్చి కందిపప్పు కప్పు అలాగే చేత్తో పట్టుకుని వాళ్ళ సంభాషణ విన సాగింది. వాళ్ళ మాటలు వీళ్ళకి, వీళ్ళ మాటలు వాళ్ళకి బాగా వినబడతాయి. అందుకనే పార్వతమ్మ ఆ తల్లీ కొడుకుల సంభాషణ వినసాగింది.

‘‘ఏరా అబ్బాయి! నువ్వు ఒక్కడివే వచ్చావంటే? దాన్ని తీసుకురాలేదా?’’ అంది శారదమ్మ.

‘‘దేన్నమ్మా?’’ అన్నాడు, దాన్ని అనగానే గుర్తురాలేదు శారదమ్మ వాళ్ళ అబ్బాయి శ్రీకాంత్‌కు.

‘‘అదేరా టీవీనిరా’’ అంది శారదమ్మ ఇప్పుడైనా అర్థమైందా అన్నట్టు.

‘‘నాకు వీలుపడలేదమ్మా. ఆఫీస్ నుంచి డైరెక్ట్‌గా ఇక్కడికే వచ్చేశాను. రేపు తీసుకువస్తాలేమ్మా’’ అన్నాడు.

ఆ మాటకు ఆవిడకు కోపం వచ్చింది. ‘‘నీకు ఎన్నిసార్లు చెప్పినా అంతే. రేపు, రేపు అంటావు. చూడు పిల్లలు ఎలా బిక్కమొహం వేసుకున్నారో టీవీ తేలేదని’’ అంది కొడుకుతో.

వాళ్ళ మాటలు వింటున్న పార్వతమ్మ ‘చూడు ఈ వంగనాచి నాతో ఎన్ని అబద్ధాలు చెప్పిందో! ఇంట్లో టీవీ వుంటే పిల్లల చదువు పాడవుతుందని అంది. మరి ఇప్పుడేమో టీవీ లేకపోతే పిల్లలు బాధపడతారు అంటోంది. అహ! ఏమి నాటకమాడుతోంది’ అని మనసులో శారదమ్మను తిట్టుకోసాగింది. ఇంతలో ఆమె తిట్లకు బ్రేక్ వచ్చింది. తల్లీ, కొడుకు గట్టిగా




మాట్లాడుకోసాగారు.

‘‘నీకు తెలుసు కదరా! అది లేకపోతే నాకు తోచదని. ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూ వుంటుంది. అందులో ఇవాళ ఆదివారం. నాకేమీ తోచడం లేదు. అది వుంటే ఎంతో కొంత కాలక్షేపం. ఎలాగైనా సరే, నీవు దాన్ని నీ సైకిలు మీద తీసుకురావడం చేతగాకపోతే, రిక్షాలోనైనా తీసుకురా. వెళ్ళరా, వెళ్ళు’’ అని బ్రతిమాలి కొడుకును పంపించింది శారదమ్మ.

‘చూడూ, కొడుకు ఆఫీస్ నుంచి రాగానే కనీసం కాళ్ళు కడుక్కున్నాక కాఫీ ఇచ్చి పంపచ్చుగా. ఏమిటో ఈ టీవీ అంటే అంత అలవాటు అయిందా ఈ మహాతల్లికి’ అనుకుని అప్పటికప్పుడే ఆవిడను బాగా దులపాలనుకుంది పార్వతమ్మ.

అప్పుడే శారదమ్మ చెత్త బైట పడెయ్యడానికి వచ్చింది. దానికోసమే వేచివున్న పార్వతమ్మ శారదమ్మతో ‘‘వదినా ఇలా రండి ఒకసారి’’ అంది.

‘‘ఏమ్మా ఇంకా ఏమన్నా కావాలా?’’ అంది శారదమ్మ.

‘‘అబ్బే! అదేమీ లేదు. నాకు తెలీక అడుగుతాను, ఇందాకట్నించీ చూస్తున్నా, నాతో ఏమో టీవీని అమ్మేశామంటివి. మరి మీ అబ్బాయి వచ్చినతర్వాత దాన్ని తీసుకురా అంటున్నావు. అబ్బ! ఒకరికేమో ఒక మాట, మరొకరితో ఇంకో మాట. ఏమి తెలివి మీరి’’ అని ఏదేదో అనసాగింది పార్వతమ్మ.

‘‘ఏమిటండీ మీరనేది? నాకేమీ అర్థం కావడం లేదు’’ అంది శారదమ్మ.

‘‘అదేనండి మీ టీవీ గురించి’’ అని అంతా వివరంగా చెప్పింది పార్వతమ్మ.

‘‘ఓహో! అదా సంగతి’’ అని విరగబడి నవ్వసాగింది శారదమ్మ.

‘‘నేను అడిగిన దానికి సమాధానమివ్వకుండా ఏమిటి, అలా నవ్వుతున్నారు?’’ అంది పార్వతమ్మ.

‘‘లేకపోతే ఏంటండి! అది మీరనుకుంటున్న దూరదర్శన్ కాదండి’’ అంది శారదమ్మ.

దానికి పార్వతమ్మ ‘‘మరి ఇంకేంటి’’ అంది.

‘‘అది... మా ఇంటి కోడలండి బాబూ!’’ అంది శారదమ్మ.

‘‘ఏమిటే! మీ ఇంటి కోడలా?’’ అంది ఆశ్చర్యపోతూ పార్వతమ్మ.

‘‘అవునండి, మా ఇంటి కోడలే. ఆమె పేరు టి. వెంకట వీరవనితా సుబ్బలక్ష్మి. అందరూ ఆమెను టి.వి. సుబ్బలక్ష్మి అంటారు. ముఖ్యంగా నేను, నా కొడుకు దాన్ని ముద్దుగా టీవీ అని పిల్చుకుంటాము’’ అని తల వంచుకుని చెప్పసాగింది శారదమ్మ.

అంతవరకు ఆమె చెప్పిన దానికంతా ఊకొడుతూ వున్నది పార్వతమ్మ. చివరి మాట చెప్పసాగింది. అంతా చెప్పి పైకి చూసింది శారదమ్మ పార్వతమ్మ ఊకొట్టడం వినబడకపోయేసరికి.

ఇంకెక్కడ పార్వతమ్మ? ఆవిడ ఇంట్లోకెళ్ళి పోయింది టీవీని, అదే దూరదర్శన్ చూడడానికి, అదండీ ఆ టీవీ కథ.